క్లుప్తంగా

రక్తహీనత నివారణకు ఐరన్ మాత్రలు



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న సీహెచ్‌ఓ

గుడిపాల: రక్తహీనతను నివారించడానికి ఐరన్ మాత్రలను తప్పనిసరిగా వేసుకోవాలని పీహెచ్‌సీ క్లస్టర్ హెల్త్ ఆఫీసర్ బాల సూర్యనారాయణ అన్నారు. గురువారం 189కొత్తపల్లెలో ఎంపీపీ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు ఆరోగ్య మెరుగునకు ఐరన్ సప్లిమెంటేషన్ కార్యక్రమం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రక్తహీనతను నివారించడానికి పిల్లలు ఐరన్, ఫోలిక్ యాసిడ్ టాబ్లెట్లను తప్పకుండా మింగాలని సూచించారు. అలాగే వ్యక్తిగత, పరిసరాల శుభ్రతపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, హెల్త్ సూపర్‌వైజర్, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

వసంతాపురంలో ఫ్యామిలీ డాక్టర్ సేవలు



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ సంధ్య

గుడిపాల: మండలంలోని వసంతాపురం గ్రామంలో గురువారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. వైద్యాధికారి డాక్టర్ సంధ్య 62 మంది రోగులకు వైద్య పరీక్షలు చేసి అనంతరం ఉచితంగా మందులను పంపిణీ చేశారు. గర్భిణులు, బీపీ, మధుమేహ వ్యాధిగ్రస్తులకు పలు ఆరోగ్య సలహాలు ఇచ్చారు. సీజనల్ వ్యాధుల పట్ల జాగ్రత్తగా ఉండాలని, పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని సూ చించారు. గర్భిణులు క్రమం తప్పకుండా పరీక్షలు చేయించుకోవాలన్నారు. ఇంటి వద్ద మంచానికి గురైన రోగుల వద్దకు వెళ్లి వైద్యపరీక్షలు చేశారు. కార్యక్రమంలో వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

ఏపీఈడబ్ల్యూఐడీసీ రాష్ట్ర డైరెక్టర్‌గా శ్రీనివాసులు



చిత్తూరు కలెక్టరేట్ : చిత్తూరు నగరానికి చెందిన జనసేన నాయకులు వుయ్యాల శ్రీనివాస్‌ను ఏపీ ఈడబ్ల్యూఐడీసీ రాష్ట్ర డైరెక్టర్‌గా నియమించారు. ఈ మేరకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. రాష్ట్ర విద్య, మౌలిక వసతుల అభివృద్ధి సంస్థ డైరెక్టర్‌గా నియమితులైన శ్రీనివాస్ గురువారం విలేకరులతో మాట్లాడారు. తనపై నమ్మకంతో డైరెక్టర్ పోస్టును అప్పగించిన వారికి ధన్యవాదాలు తెలిపారు. ఏపీఈడబ్ల్యూఐడీసీ రాష్ట్ర డైరెక్టర్‌గా పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనకు తనవంతు చర్యలు చేపడతానని ఆయన వెల్లడించారు. పలువురు ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.

బాలికల్లో రక్తహీనత నివారణకు చర్యలు



విద్యార్థులకు ఐరన్ మాత్రలు వేస్తున్న వైద్య సిబ్బంది

ఐరాల: బాలికల్లో రక్తహీనత నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు వైద్యాధికారి రెడ్డెప్ప తెలిపారు. గురువారం పీహెచ్‌సీ పరిధిలోని పాఠశాలల్లో విద్యార్థులకు వైద్య సిబ్బంది ఐరన్ పోలిక్ యాసిడ్ మాత్రలు మింగించినట్లు చెప్పారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రక్తహీనత నివారణకు బాలికలు ఐరన్ పోలిక్ యాసిడ్ మాత్రలు తప్పనిసరిగా వేసుకోవాలని సూచించారు. రక్తహీనత ఉండి, శారీరకంగా ఎదగకపోవడం, ఎముకలు గట్టిపడకపోవడం వంటి లక్షణాలు ఉంటే ఈ మాత్రలు వేసుకుంటే ఫలితం ఉంటుందని తెలిపారు. ప్రతి గురువారాన్ని ఐరన్ పోలిక్ యాసిడ్ డేగా నిర్వహించాలని జిల్లా అధికారుల సూచనల మేరకు ఈ కార్యక్రమాన్ని కొనసాగించనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

బస్సు ఢీకొన్న వ్యక్తి మృతి

చిత్తూరు అర్బన్: ఆర్టీసీ బస్సు ఢీకొన్న వ్యక్తి తిరుపతిలోని ఆస్పత్రికి తీసుకెళుతుండగా.. మార్గమధ్యలోనే మృతి చెందిన ఘటన బుధవారం నగరంలో వెలుగు చూసింది. ఘటనకు సంబంధించి ట్రాఫిక్ సీఐ తెలిపిన వివరాలు ఇలా.. చిత్తూరు నగరంలోని సత్యనారాయణపురానికి చెందిన నాగరాజు (59) అనే వ్యక్తి బుధవారం పని ముగించుకుని ద్విచక్రవాహనంపై కాణిపాకం నుంచి ఇంటికి వస్తుండగా ఆర్టీసీ బస్సు ఢీకొట్టింది. గమనించిన స్థానికులు అతన్ని చిత్తూరు ఆస్పత్రిలో చేర్చారు. ఆపై మెరుగైన వైద్యం కోసం బాధిత కుటుంబ సభ్యులు నాగరాజును తిరుపతికి తీసుకెళ్తుండగా అతను మార్గమధ్యలోనే మృతిచెందాడు. ఘటనపై కేసు నమోదు చేసిన ట్రాఫిక్ సీఐ ఈ వివరాలను మీడియాకు వెల్లడించారు.

స్మార్ట్ గందరగోళం

■ చిత్తూరు మండలం 36 గొల్లపల్లిలో బతికునోళ్ల కార్డును తొలగించారు. చనిపోయిన ఆమె పేరుతో కార్డును మంజూరు చేశారు. ఏడాదికి క్రితం మొగిలమ్మ (భర్త పేరు చిన్నస్వామి మందడి) అనే వృద్ధురాలు చనిపోయింది. ఈమె భర్త కూడా కొన్నేళ్లకు క్రితమే మరణించారు. ఈమె కార్డును తొలగించాల్సి ఉండగా..బతికి ఉన్న ఎం.మొగిలమ్మ (భర్తపేరు దొరస్వామి మందడి) కార్డును తొలగించారు. దీంతో ఎం మొగిలమ్మకు రెండు నెల రేషన్ ఆగింది. కార్డు కోసం ఇబ్బంది పడుతోంది.



■ ఈ చిత్రంలో ఉన్న వ్యక్తి పేరు అనిల్. చిత్తూరు నగరం అనుపల్లికి చెందిన వ్యక్తి. రెండేళ్లకు క్రితం పెళ్లై పిల్లలున్నారు. ప్రభుత్వం రేషన్ కార్డు దరఖాస్తుకు అవకాశం కల్పించడంతో సచివాలయంలో రేషన్‌కార్డు కోసం దరఖాస్తు చేసుకున్నాడు. తీరా వీఆర్వో లాగిన్‌లో రిజెక్ట్ చేశారు. ఎలాంటి విచారణ చేయకుండా రిజెక్ట్ చేయడంతో ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు. రెండేళ్లుగా కార్డు కోసం ఎదురు చూసి ఇతనికి రేషన్‌కార్డుల మంజూరు జాబితాలో తన పేరు లేకపోవడంతో అనిల్ అయోమయానికి గురవుతున్నాడు.



- పేదల ఆశలపై నీళ్లు చల్లిన పాలక యంత్రాంగం
- జిల్లాలో అస్తవ్యవస్తంగా స్మార్ట్‌రేషన్ కార్డుల జారీ
- తప్పుల తడకగా ముద్రణ
- బతికున్న వాళ్లకు కార్డు తొలగించి.. చనిపోయినోళ్లకు కార్డు జారీ చేశారు
- క్షేత్రస్థాయిలో విచారించకుండానే రిజెక్ట్ చేసిన అధికారులు
- రెండేళ్ల పాటు ఎదురు చూసిన పేదలకు భంగపాటు

చిత్తూరు రూరల్ (కాణిపాకం): కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాదిన్నర కాలంలో రేషన్ కార్డుల మంజూరు విషయంలో తీవ్ర జాప్యం చేస్తూ వచ్చింది. అయితే ఎట్టకేలకు ఇటీవల మంజూరు చేసిన స్మార్ట్ కార్డుల్లో కోత పెడుతూ.. సామాన్య జనాన్ని ఇబ్బందులకు గురి చేశారు. జిల్లాలోని 1339 షాపుల కింద 5.34 లక్షలు ఉన్నాయి. కూటమి ప్రభుత్వం 5.27 లక్షల వరకు స్మార్ట్ రేషన్ కార్డులను మంజూరు చేసింది. మిగిలిన కార్డులను ఈకేవైసీ, ఇతరత్రా సమస్యలను చూపి కోత విధించింది. కొత్త స్మార్ట్‌కార్డుల్లో పలు తప్పిదాలు దొర్లాయి. ప్రధానంగా బతికి ఉన్నవాళ్ల కార్డును తొలగించేశారు. చనిపోయిన వారికి కార్డులు ఇచ్చారు. చాలావరకు స్మార్ట్‌కార్డుల్లో అక్షర దోషాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. పేర్లు తప్పుల తడకగా ఉన్నాయి. వయసులో తేడాలు, షాపు నంబర్లు, చిరునామా, ఆడ, మగ, సచివాలయం పేర్లు, ఇతరత్రా తారుమారయ్యాయి. ఇక మంజూరైన కార్డులను షాపుల వారీగా కాకుండా ఇష్టానుసారంగా పంచి పెట్టేశారు. ఆ కార్డులు ఏ షాపుల్లో ఉన్నాయో తెలియని పరిస్థితి నెలకొంది.

ఇదీ దరఖాస్తులు.. మంజూరు పరిస్థితి

రేషన్‌కార్డుల కోసం జిల్లావ్యాప్తంగా 75,435 దరఖాస్తులు వచ్చాయి. ఇందులో 54,309 మందికి కార్డులు వచ్చాయని అధికారులు లెక్కలు చెబుతున్నారు. కుంటిసాకులతో 16,471 దరఖాస్తులను రిజెక్ట్ చేశారు. వీటిని క్షేత్రస్థాయిలో పరిశీలించకుండా, దరఖాస్తుల ప్రమేయమే లేకుండా సచివాలయ సిబ్బంది, మండల స్థాయి సిబ్బంది కూర్చున్న సీటు నుంచి కదలకుండా రిజెక్ట్ కొట్టారు. ఇలాంటి దుస్థితి చిత్తూరు అర్బన్‌లో కుప్పలు తెప్పలుగా ఉంది. చాలావరకు దరఖాస్తులను వీఆర్వో, మండలస్థాయి లాగిన్‌లో అప్రూవల్ ఇవ్వకుండా అలానే ఉంచేశారు. ఇందుకోసం దరఖాస్తుదారులు కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. అయినా అధికారులు ఏమాత్రం పట్టించుకోవడం లేదు. కాగా మొత్తం 4,650 దరఖాస్తులు పరిశీలనలో ఉన్నట్లు అధికారులు లెక్కలు చెబుతున్నారు. 2వేలకు పైగా మృతులు, ఇతరత్రా కారణాలతో తొలగించినట్లు సమాచారం. అలాగే 8వేల కార్డులు ఈకేవైసీ సమస్యతో ఏమయ్యాయో తెలియని పరిస్థితి. ఇప్పటికైనా అధికారులు స్పందించి రేషన్‌కార్డు దరఖాస్తులో ఇబ్బంది లేకుండా చూడాలని డిమాండ్ చేస్తున్నారు.

దరఖాస్తు వివరాలు...

దరఖాస్తు రకం	మొత్తం దరఖాస్తులు	మంజూరు	రిజెక్ట్	పెండింగ్
సభ్యుల చేర్పు	57874	42388	12314	3172
కొత్తకార్డు	7699	4742	2491	466
స్ప్లిట్‌కార్డు	9862	7179	1671	1012

పరిశీలిస్తాం..

ప్రభుత్వ ఆదేశాల మేరకు స్మార్ట్‌కార్డులు మంజూరయ్యాయి. వాటిని క్షేత్రస్థాయిలో పంచి పెడుతున్నారు. పాతవాటిలో ఏ రకంగా ఉంటుందో ఆ రకంగానే ముద్రణ అయింటుంది. తప్పులు సరిదిద్దేందుకు అవకాశం వస్తుంది. కొన్ని కార్డుల షాపులు మారాయి. వాటిని కూడా సేకరించి అందేలా చేస్తాం. ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. చనిపోయిన వారికి కార్డు వచ్చిందనే విషయాన్ని పరిశీలిస్తాం.

– శంకరన్, డీఎస్‌ఓ, చిత్తూరు

షుగర్ వ్యాధిపై నిర్లక్ష్యం తగదు



వృద్ధురాలికి వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యసిబ్బంది

ఐరాల: షుగర్ వ్యాధిని నియంత్రణలో పెట్టుకోకపోతే శరీరంలో అవయవాలకు ప్రమాదం వాటిల్లుతుందని స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి రెడ్డెప్ప తెలిపారు. గురువారం మండలంలోని ఇరువారంపల్లెలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. 104 వాహనంలో వైద్యాధికారి 56 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేవారు. గ్రామంలో ఏర్పాటు చేసిన వైద్యశిబిరంలో గర్భిణులు, బాలింతలు, ఆస్త మా, బీపీ, షుగర్ వ్యాధిగ్రస్తులకు పరీక్షలు చేశారు. ఆయన మాట్లాడుతూ షుగర్ వ్యాధి చికిత్సలో ఆహార నియమాలు, వ్యాయామం కీలకపాత్ర పోషిస్తాయని చెప్పారు. షుగర్ వ్యాధి వల్ల వచ్చే కిడ్నీ, గుండె జబ్బులను నివారించే మందులు సైతం అందుబాటులో ఉన్నట్లు వెల్లడించారు. బాధితులు షుగర్, బీపీ, కొలెస్ట్రాల్ అదుపులో పెట్టుకుని, వైద్యుల సలహాలతో మందులు వాడడం ద్వారా ఆరోగ్యాన్ని కాపాడోకోవచ్చని సూచించారు. వ్యాధి నియంత్రణకు మందులు ఏ విధంగా వాడాలో వివరించారు. కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ మునిరత్నం, ఎంఎల్‌హెచ్‌పీలు, ఏఎన్‌ఎంలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

సమాజ నిర్దేశకులు గురువులే



మాట్లాడుతున్న ఎంఈఓ హేమలత

తవణంపల్లె: సమసమాజ నిర్దేశకులు గురువులేనని ఎంఈఓ హేమలత అన్నారు. గురువారం మండలంలోని పొన్నేడుపల్లె ఆదర్శ ప్రాథమిక పాఠశాలలో ముందస్తు ఉపాధ్యాయుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూజలు చేసి నివాళులర్పించారు. అనంతరం ఎంఈఓ మాట్లాడుతూ ఉపాధ్యాయ వృత్తి ఉన్నతమైనదన్నారు. అనంతరం ఎంఈఓ హేమలతను, చిత్తూరు ఎంఈఓ మోహన్‌ను స్కూల్ హెచ్‌ఎం మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో శాలువతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లితండ్రులు పాల్గొన్నారు.

ఎయిడ్స్‌పై అవగాహన



మాట్లాడుతున్న కోర్ ఎన్జీఓ నిర్వాహకురాలు లక్ష్మీ

చిత్తూరు కలెక్టరేట్ : విద్యార్థులు ఎయిడ్స్ పట్ల అవగాహన కలిగి ఉండాలని కోర్ ఎన్‌జీఓ నిర్వాహకులు లక్ష్మీ అన్నారు. ఈ మేరకు గురువారం నగరంలోని సావిత్రమ్మ మహిళా డిగ్రీ కళాశాలలో ఎన్‌జీవో సంస్థ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ యువతకు ఎయిడ్స్ పట్ల అవగాహన ముఖ్యమన్నారు. ఎయిడ్స్‌కు చికిత్స కన్నా నివారణే మంచిదన్నారు. హెచ్‌ఐవీ కేవలం అసురక్షిత లైంగిక సంబంధాలు, హెచ్‌ఐవీ ఉన్న గర్భిణి నుంచి పుట్టబోయే బిడ్డకు, హెచ్‌ఐవీతో కలుషితమైన సూదులు, సిరంజీలు, పరీక్షింపబడని రక్తంతో సంక్రమించే అవకాశం ఉంటుందన్నారు. హెచ్‌ఐవీ ఉందనే కారణంతో వివక్ష చూపకూడదన్నారు. అలా చేస్తే హెచ్‌ఐవీ, ఎయిడ్స్ చట్టం 2017 ప్రకారం శిక్షార్హమైన నేరమన్నారు. హెచ్‌ఐవీ పట్ల ఎటువంటి సందేహాలు ఉన్నా జాతీయ హెల్ప్‌లైన్ 1097 నంబర్‌కు కాల్ చేసి నివృత్తి చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో కోర్ ఎన్‌జీవో సభ్యులు సద్దాం, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి చొరవ చూపండి



సమీక్షిస్తున్న డిప్యూటీ సీఈఓ వెంకటనారాయణ

పూతలపట్టు(యాదమరి): పూతలపట్టు మండలంలో చిత్తూరు జెడ్పీ డిప్యూటీ సీఈఓ వెంకటనారాయణ ఆకస్మికంగా పర్యటించారు. గురువారం ఆయన స్థానిక ఎంపీడీఓ కార్యాలయాన్ని తనిఖీ చేశారు. ఎంపీడీఓ నాగరాజు, ఈఓపీఆర్డీ శ్రీనివాస్‌తో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి సచివాలయాన్ని తనిఖీ చేసి.. ప్రజల సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించేలా కృషి చేయాలని చెప్పారు. పల్లె ప్రగతికి సహకరించి అభివృద్ధికి ప్రణాళికలు సిద్ధం చేయాలని సూచించారు. గ్రామాల్లో నిత్యం పారిశుద్ధ్య పనులు పర్యవేక్షించి చెత్త నుంచి సంపద సృష్టికి చర్యలు తీసుకోవాలని కోరారు. తద్వారా పంచాయతీలకు అదనపు ఆదాయం చేకూర్చాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

మొక్కల పెంపకంతో పర్యావరణం పెంపు



మొక్కలు నాటి నీరుపోస్తున్న అదనపు పీడీ మల్లికార్జున

తవణంపల్లె: చెట్లు పెంచి పర్యావరణాన్ని పెంపొందించాలని డ్వామా అదనపు పీడీ మల్లికార్జున తెలిపారు. గురువారం మండలంలోని టి.పుత్తూరు పంచాయతీ బోడిగుట్టలో గ్రీనింగ్ ఆఫ్ హిలాక్స్ కార్యక్రమంలో భాగంగా ఉపాధి కూలీలచే 1600 మొక్కలు నాటే కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి చెట్టును పోషించే బాధ్యత తీసుకోవాలని సూచించారు. అనంతరం ఎంపీడీఓ కార్యాలయంలో సమీక్ష నిర్వహించారు. మినీ గోకులాల పనులను వెంటనే పూర్తి చేయించాలని ఆదేశించారు. ప్రతి గ్రామంలో కూలీలకు పనులు కల్పించాలన్నారు. సమావేశంలో ఎంపీడీఓ హరిప్రసాద్ రెడ్డి, ఏపీఓ బాల, ఈసీ రమ్య, ఉపాధి సిబ్బంది, కూలీలు పాల్గొన్నారు.

ఉద్యోగులకు బదిలీ సర్వసాధారణం



ఉపాధ్యాయులను సన్మానించిన సహోపాధ్యాయులు

బంగారుపాళెం: ఉద్యోగులకు బదిలీ అనేది సర్వసాధారణమని ఎంఈఓ నాగేశ్వర్‌రావు అన్నారు. గురువారం సాయంత్రం మండలంలోని పీడీవీ కండ్రిగ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బదిలీ ఉపాధ్యాయుల సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు. సీఆర్‌సీ కార్యదర్శి చిట్టెమ్మ, బోడబండ్ల హెచ్‌ఎం నిర్మల ఆధ్వర్యంలో పీడీవీ కండ్రిగ సీఆర్‌సీ పరిధిలో బదిలీపై ఇతర పాఠశాలలకు వెళ్లిన ఉపాధ్యాయులను సహోపాధ్యాయులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ.. బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయుల సేవలను కొనియాడారు. అక్కడ కూడా మంచి పేరు తెచ్చుకోవాలన్నారు. కార్యక్రమంలో సీఆర్‌సీ జాయింట్ కార్యదర్శి రవీంద్రప్రసాద్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కళాకారుల నృత్యప్రదర్శన



స్వామివారికి క్షీరాభిషేకం చేస్తున్న అర్చకులు





భిక్షాండిలో...

వినువీధుల్లో విఘ్నేశ్వరుడి సంబరం

వరసిద్ధి వినాయక స్వామి దేవస్థానం వార్షిక బ్రహ్మోత్సవాలు వేడుకగా సాగుతున్నాయి. సిద్ధి, బుద్ధి సమేత వినాయకస్వామి అశ్వవాహనంపై పుర వీధుల్లో విహరిస్తూ.. డప్పు వాయిద్యాలు, మేళతాళాలు, మంగళ వాయిద్యాలు, కోలాటలు, కళాకారుల సాంస్కృతిక ప్రదర్శనలు వాహనసేవల ముందు ఆకట్టుకున్నాయి. తిరుకల్యాణోత్సవం సందర్భంగా నిర్వహించిన భిక్షాండి అట్టహాసంగా జరిగింది. – కాణిపాకం



కూచిపూడి నాట్యప్రదర్శన ఇస్తున్న కళాకారులు

టౌన్ బ్యాంకు కమిటీ ప్రమాణస్వీకారం

చిత్తూరు రూరల్ (కాణిపాకం) : చిత్తూరు నగరంలోని జెడ్పీ సమావేశ మందిరంలో గురువారం చిత్తూరు కోఆపరేటివ్ టౌన్ బ్యాంక్ నాన్ అఫీషియల్ పర్సన్ ఇన్‌చార్జ్ కమిటీ ప్రమాణ స్వీకార కార్యక్రమం నిర్వహించారు. బ్యాంక్ కమిటీ చైర్మన్‌గా కాండ్ర రమేష్ నాయుడు, డైరెక్టర్లుగా సురేష్, నరసింహులు, అన్సర్ తదితరులు ఎమ్మెల్యే గురజాల జగన్‌మోహన్ సమక్షంలో ప్రమాణ స్వీకారం చేశారు. సమావేశంలో ప్రజాప్రతినిధులు, టీడీపీ నేతలు పాల్గొన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయురాలిగా మీనాక్షి



యాదమరి: జిల్లా విద్యాశాఖ ప్రకటించిన ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుల్లో భాగంగా మండలంలోని వరిగపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సాంఘికశాస్త్రం ఉపాధ్యాయురాలిగా పని చేస్తున్న మీనాక్షి ఎంపికయ్యారు. ఈమె ఎంపిక కావడంపై ఎంఈఓలు రుక్మిణి, ప్రసాద్, ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు మదన్‌మోహన్, ఉపాధ్యాయులు తదితరులు హర్షం వ్యక్తం చేశారు.

స్వామిత్వ సర్వే తనిఖీ



సర్వేని తనిఖీ చేస్తున్న అధికారి సుధాకర్ రావు

గంగాధర నెల్లూరు: మండల పరిధిలో జరుగుతున్న స్వామిత్వ సర్వేను జిల్లా పంచాయతీ అధికారి సుధాకర్ రావు, డివిజనల్ పంచాయతీ అధికారులు గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మండల పరిధిలోని గొల్లపల్లి, పెద్ద కాలువ, చెర్లోపల్లి ప్రాంతాల్లో తనిఖీలు నిర్వహించారు. అలాగే చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాల్లో డీపీఆర్సీ రీసోర్స్ పర్సన్ గజేంద్ర ఆధ్వర్యంలో ముక్కళతూరు, బంగారెడ్డిపల్లి, గంగాధర నెల్లూరు కేంద్రాల్లో తనిఖీ చేశారు. ఇందులో ముక్కలత్తూరులో చెత్త నుంచి సంపద తయారీ కేంద్రంలో పెంచిన మొక్కలను ఉద్దేశించి సిబ్బందిని ప్రశంసించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ఎంపీడీఓ లోకేష్, డిప్యూటీ ఎంపీడీఓ శివయ్య, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

ఘనంగా కుంభాభిషేకం



వేణుగోపాలస్వామి ఆలయంలో మహా కుంభాభిషేకం నిర్వహిస్తున్న వేద పండితులు

పెనుమూరు(కార్వేటినగరం): పెనుమూరు మండలంలోని పులికల్లులో వెలసిన వేణుగోపాలస్వామి ఆలయ కుంభాభిషేకం వేడుకలు గురువారం వైభవంగా జరిగాయి. ఈ సందర్భంగా వేద పండితులు వేద మంత్రాల నడుమ విశ్వక్సేన ఆరాధన, పుణ్యాహవచనం జరిపించారు. అనంతరం కలశ ఆరాధన, మహా పూర్ణాహుతి చేపట్టారు. ఉదయం 11 గంటలకు ఆలయ మహా కుంభాభిషేకాన్ని వేద పండితులు వైభవంగా నిర్వహించారు. ఈ వేడుకలను మాజీ ఎంపీ మహాసముద్రం జ్ఞానేంద్రరెడ్డి ముఖ్య అతిథిగా విచ్చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహా కుంభాభిషేకానికి వైఎస్సార్‌సీపీ చిత్తూరు జిల్లా సమన్వయకర్త మహాసముద్రం దయాసాగర్ రెడ్డి, పారిశ్రామికవేత్త కిరణ్‌కుమార్‌రెడ్డి, పులిగుంటీశ్వరస్వామి దేవస్థానం చైర్మన్ ప్రతాపరెడ్డి తదితరులు ఉభయదారులుగా వ్యవహరించారు.

కాళీకమ్మకు ప్రత్యేక పూజలు

గంగాధర నెల్లూరు: మండలంలోని తూగుండ్రం పంచాయతీ కండ్రిగ దళితవాడలో శ్రీ కాళీకామ్మ ఆలయ అష్టబంధనం, మహా కుంభాభిషేకం గురువారం ఘనంగా నిర్వహించారు. గ్రామ పురవీధుల్లో దీప కాంతులతో ప్రత్యేకంగా అలంకరించారు. యాగశాల పూజ, హోమం, భింభి శుద్ధి, తత్వార్చన, మహా పూర్ణాహుతి, యాత్రదానం, కలశం బయలుదేరుట పూజల అనంతరం మహా కుంభాభిషేకం, దీపారాధన చేసి తీర్థప్రసాదాలు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.